క్లుప్తంగా

అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తి



కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దిండిగాల తదితరులు

కొత్తగూడెంఅర్బన్: భారత మాజీ రాష్ట్రపతి, దేశ మిస్సైల్ మ్యాన్, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని తెలంగాణ మలిదశ ఉద్యమ నేత, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల రాజేందర్ అన్నారు. కలాం 92వ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దిండిగాల మాట్లాడుతూ.. కలాం అణు పరీక్షలలో కీలకమైన సాంకేతిక శాస్త్రీయ రాజకీయ సంస్థాగత పాత్ర పోషించారని తెలిపారు. దేశ రక్షణ రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంచి దేశ ఖ్యాతిని చాటరని కొనియాడారు. ఆయన చేసిన కృషికి పద్మభూషణ్, పద్మ విభూషణ్, భారతరత్న వంటి ప్రతిష్టాత్మక బిరుదులను అందుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథపాలకులు డి.వరలక్ష్మీదేవి, జి.మణిమృదుల, రచయితలు ఆంగోతు జేయవాస్, ప్రభాకరచార్యులు, పాఠకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం



నెహ్రూనగర్‌లో ప్రచారం చేస్తున్న స్రవంతి

ఇల్లెందురూరల్: పార్టీ అధిష్టానం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను ప్రజలు హర్షిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పార్టీ నియోజకవర్గ నాయకురాలు బానోత్ స్రవంతి అన్నారు. మండలంలోని ఒడ్డుగూడెం గ్రామ పంచాయతీ నెహ్రూనగర్ తండా గ్రామంలో ఆదివారం ఆమె కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ప్రచార కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందని గుర్తుచేశారు. నాడు దరఖాస్తులను నేరుగా అధికారులకు అందజేసి సంక్షేమ పథకాలను పొందేవారని, నేడు నేరుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇచ్చి గులాబీ కండువా కప్పుకుంటేనే వర్తిస్తున్నాయని ఆరోపించారు. ధన్‌సింగ్, బానోత్ శ్రీను, ఉపేందర్, మాలోత్ వీరన్న పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

పాల్వంచరూరల్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్‌ఐ కార్తీక్ తెలిపిన వివరాలు.. మండల పరిధి రంగాపురం గ్రామంలో ఆదివారం పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న కాంపాటి వెంకటేశ్వర్లు (కేటీపీఎస్ ఉద్యోగి), నాగారం గ్రామానికి చెందిన పెద్దమ్మగుడి కమిటీ సభ్యుడు కటారపు లక్ష్మీనారాయణ, మల్లాడి సాయికుమార్, రంగాపురానికి చెందిన మాలోతు జగదీష్‌లను అదుపులోకి తీసుకుని రూ.9,400 నగదు, నాలుగు సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా చలువ పందిళ్లు నిర్మించి దుర్గామాత అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన మండపాల్లో అమ్మవారు తొలిరోజు శ్రీబాలాత్రిపుర సందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పలువురు అమ్మవారి మాల ధరించి పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. కేటీపీఎస్, సింగరేణి ఏరియా గనులు, డిపార్ట్‌మెంట్లలో ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో అమ్మవారికి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు. శాసనసభ ఎన్నికలకు ప్రకటన రావడంతో పలువురు నాయకులు స్థానిక అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి తమ పార్టీ విజయం సాధించాలని మొక్కుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంటౌన్: గణేష్ టెంపుల్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజలు



ఇల్లెందు: కళాసీబస్తీ దుర్గామాత ఆలయం వద్ద మండపంలో ప్రత్యేక పూజలు



పాల్వంచ: పూజలో పాల్గొన్న కేటీపీఎస్ ఇన్‌చార్జ్ సీఈ వెంకటేశ్వరరావు దంపతులు



పాల్వంచరూరల్: నాగారంలో దుర్గాదేవి అమ్మవారి ప్రతిష్ఠపానలో పాల్గొన్న భక్తులు



సింగరేణి(కొత్తగూడెం): 7వ నంబర్ బజార్‌లో అమ్మవారి మండపంలో పూజలు



జూలూరుపాడు: అమ్మవారికి పూజలు చేస్తున్న పాపకొల్లు శివాలయం చైర్మన్ కోటేశ్వరరావు





కొత్తగూడెం గణేష్ టెంపుల్‌లో అమ్మవారికి అభిషేకం.., పెద్దబజార్‌లో కొలువుదీరిన అమ్మవారు



బూడిదగడ్డ బస్తీలోని శ్రీమహంకాళీ అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న పాసీ కులస్తులు



ఇల్లెందు: నంబర్-2 బస్తీ రామాలయం వద్ద...



టేకులపల్లి: కోయగూడెంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య దంపతులు



టేకులపల్లి రామాలయం వద్ద మండపంలో పూజలు చేస్తున్న భక్తులు



జూలూరుపాడు: పాపకొల్లు శ్రీకోటమైసమ్మ ఆలయం వద్ద మండపంలో...

పోలింగ్ స్టేషన్ల సందర్శన

జూలూరుపాడు: జూలూరుపాడు హైస్కూల్‌లోని 95, 96 పోలింగ్ స్టేషన్లను ఆదివారం వైరా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి సత్యప్రసాద్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ స్టేషన్‌లో విద్యుత్, తాగునీటి, వెలుతురు, ర్యాంప్, టాయిలెట్స్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో జూలూరుపాడు తహసీల్దార్ శారద, గిర్దావర్ ఎం.తిరుపతిరావు, ఎంపీఓ తులసీరామ్, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

లాభాల వాటా చెల్లించకపోతే ఆందోళన చేస్తాం..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి యాజమాన్యం ముందస్తుగా ప్రకటించిన విధంగా ఈనెల 16న 32 శాతం లాభాల వాటా చెల్లించని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎలక్షన్ కోడ్ పేరుతో లాభాల వాటాను కార్మికుల ఖాతాలో వేయకుండా నిలిపివేయటం యాజమాన్య నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సింగరేణి ఎన్నికలకు కోడ్ వస్తే ఎన్నికలు వాయిదా వేయించిన యాజమాన్యం కార్మికుల లాభాల వాటా విషయంలో ముందస్తుగా ఎందుకు జాగ్రతలు తీసుకోలేదని ప్రశ్నించారు. యాజమాన్యం నిబంధనలు పెట్టకుండా లాభాల వాటాను కార్మికుల ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేశారు.

టీడీపీకి బలమైన కేడర్ ఉంది

ఇల్లెందు: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ఇల్లెందులో టీడీపీ పోటీ చేస్తుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్రగడ వంశీ అన్నారు.

ఆదివారం పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ.. ఇల్లెందులో టీడీపీ బలమైన కేడర్, ఓటు బ్యాంకు కలిగి ఉందన్నారు. తమ పార్టీ తరుపున వాసం విజయలక్ష్మి (టేకులపల్లి), చాందావత్ రమేష్‌బాబు (ఇల్లెందు), లక్ష్మయ్య(గార్ల), బానోతు రమేష్ (కామేపల్లి) టికెట్ ఆశిస్తున్నట్లు తెలిపారు. సర్వేల ఆధారంగా పార్టీ అధిష్టానం అభ్యర్థిని ఎంపిక చేస్తుందన్నారు. గుడిపూడి మోహన్‌రావు, పి.బాలకృష్ణ, కోటేశ్వరరావు, నర్సయ్య, పిడమర్తి రమేష్, కొమ్మినేని సత్యనారాయణ, రాజేందర్, నాగరాజు, శివ, మోహన్, రాంగోపాల్, శ్రీహరి, గోపాల కృష్ణ, వినీత్, శ్రీవేద్ తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో బీజేపీదే విజయం



మాట్లాడుతున్న కొండపల్లి శ్రీధర్‌రెడ్డి

చుంచుపల్లి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించేందుకు ఆసక్తిగా ఉన్నారని, రాష్ట్రంలో కచ్చితంగా బీజేపీ అధికారంలోకి వచ్చి తీరుతుందని కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో కొత్తగూడెం అసెంబ్లీ స్థాయి సమావేశం నిర్వహించారు. మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా బూత్ స్థాయిలో పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. జిల్లాలో బీజేపీకి అన్నివర్గాల నుంచి మంచి స్పందన కనిపిస్తోందని, కొత్తగూడెంలో గెలుపు ఖాయం అన్నారు. కాలం చెల్లిన వామపక్ష భావజాలానికి ప్రజలు పట్టం కట్టబోరని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిన బీఆర్‌ఎస్‌ను గద్దెదించాలని ప్రజలు భావిస్తున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పనిచేస్తోందన్నారు. సోమసుందర్, ఎడవల్లి శ్రీనివాస్, రంగరాజు, రుక్మారావు, నరేందర్, రంగా కిరణ్, బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, లక్కినేని సురేందర్, ఆకుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే బీఎస్పీ లక్ష్యం



మాట్లాడుతున్న కామేశ్

పాల్వంచ: ఎన్నికల సమయంలో వచ్చే పొలిటికల్ టూరిస్ట్‌లను నమ్మొద్దని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసే బీఎస్పీని ఆదరించాలని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేశ్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నేటీ నుంచి బీఎస్పీ ఆధ్వర్యంలో మన కొత్తగూడెం.. మన కామేశ్ కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో కొత్తగూడెం నుంచి బీఎస్పీ నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటున్న తనను గెలిపించాలని కోరారు. పెద్దమ్మగుడిలో పూజలు చేసి, ఇంటింటి ప్రచారం చేస్తూ బీఎస్పీ పార్టీ గెలుపు ఆవశ్యకతను వివరిస్తామన్నారు. రాబోయే 50 రోజులు ఎంతో కీలకమని పేర్కొన్నారు. కార్యకర్తలు కష్టపడి పనిచేసి విజయం సాధించేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కోళ్లపూడి ప్రవీణ్‌కుమార్, మహిళా అధ్యక్షురాలు కేతిని కుమారి, మండల అధ్యక్షురాలు కాటబోయిన వసుందర, యర్రంశెట్టి రాజేశ్వరి, మంజు, పద్మ, భానుమతి తదితరులు పాల్గొన్నారు.

గూడెంలో 'బీఆర్‌ఎస్' సంబురాలు



సంబురాలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): వచ్చే ఎన్నికలకు కొత్తగూడెం బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు ఆదివారం రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు బీఫామ్ అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం బస్టాండ్ సెంటర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. టపాకాయలు కాల్చి, స్వీట్స్ పంపిణీ చేశారు. అనంతరం జై కేసీఆర్.. జై వనమా.. అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.

ప్రవల్లిక మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి



మాట్లాడుతున్న నిమ్మల రాంబాబు

పాల్వంచ: మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని ప్రవల్లిక మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా జిల్లా నాయకుడు నిమ్మల రాంబాబు అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో తనకు ఉద్యోగం రాదేమోనని మనస్థాపంతో ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆమె చావును అవమానపర్చేలా పోలీసులు ప్రకటన చేయడం కేసీఆర్ ప్రభుత్వ దిగజారుడుకు నిదర్శనం అన్నారు. ఆమె కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తల్లిదండ్రులకు రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పూనెం రమేశ్, ప్రగతి శీల యువజన సంఘం మండల అధ్యక్షుడు కుంజా రమేశ్, వి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

ఇల్లెందు: ప్రేమించి పెళ్లి చేసుకుని ఇప్పుడు కట్నం కోసం వేధిస్తున్నాడంటూ ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన జోగునూరి కృష్ణవేణి – సాయినాథ్ రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. కొంతకాలంగా కట్నం తీసుకుని రాలేదంటూ వేధింపులకు పాల్పడుతున్నారు. ఈ మేరకు కృష్ణవేణి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ రవూఫ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భర్త సాయినాథ్, అత్త నాగమణి మీద కేసు నమోదు చేశారు.

బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారం



కాకర్ల శ్రీఆంజనేయస్వామి ఆలయాన్ని దర్శించుకుంటున్న బీఆర్‌ఎస్ నాయకులు

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ విజయాన్ని కాంక్షిస్తూ ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. 24 గ్రామ పంచాయతీల్లోని ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా పూజా కార్యక్రమాల్లో జూలూరుపాడు జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా కళావతి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెకంటి సతీష్ కుమార్, మాజీ అధ్యక్షుడు చావా వెంకటరామారావు, రైతు సమన్వయ సమితి కోఆర్డినేటర్ ఎదళ్లపల్లి వీరభద్రం, యల్లంకి సత్యనారాయణ, పోలుదాసు కృష్ణమూర్తి, మూడ్ చిట్టిబాబు, మంగముడి నాగేశ్వరరావు, సాయిన్ని శ్రీనివాసరావు, దుద్దుకూరి నాగేశ్వరరావు, మోదుగు రామకృష్ణ, పణితి వెంకటేశ్వర్లు, నిమ్మటూరి కనకయ్య, తాళ్లూరి రామారావు, ధరావత్ నాగేశ్వరరావు, రెడ్డిబోయిన రాము, వాంకుడోత్ వెంకన్న, మాళోత్ నరసింహారావు, భూక్యా జవహర్‌లాల్, బాదావత్ లక్ష్మి, మోహన్‌రావు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు..

బీఆర్‌ఎస్ వైరా ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ మదన్‌లాల్ హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ చేతులు మీదుగా ఆదివారం బీఫామ్ అందుకున్నారు. ఈ మేరకు జూలూరుపాడులో బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు.

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు



ఇల్లెందురూరల్: రేపల్లెవాడలో హర్షం వ్యక్తం చేస్తున్న పార్టీ కార్యకర్తలు

ఇల్లెందు: బీఆర్‌ఎస్ పార్టీ ఇల్లెందు ఎమ్మెల్యే అభ్యర్థిగా, ఎమ్మెల్యే హరిప్రియకు సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ఆదివారం బీఫాం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ శ్రేణులు ఇల్లెందులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఘనంగా సంబురాలు నిర్వహించారు. ఆదివారం మధ్యాహ్నం క్యాంపు కార్యాలయం ఎదుట, తెలంగాణ తల్లి విగ్రహం, పాత బస్టాండ్ సెంటర్‌లో టపాసులు, బాణసంచా పేల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం జిల్లా గ్రంథాలయ కమిటీ చైర్మన్ దిండిగల రాజేందర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ మూడోసారి హ్యాట్రిక్ సీఎంగా నిలిచిపోతారని తెలిపారు. గడిచిన పదేళ్ల పాలనలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు చేశాడని గుర్తు చేశారు. దేశానికి రోల్ మోడల్‌గా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. ప్రతీ కార్యకర్త కష్టపడి పని చేసి గెలుపు లక్ష్యంగా కృషి చేయాలని కోరారు. టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎస్.రంగనాథ్, పరుచూరి వెంకటేశ్వరరావు, కొక్కు నాగేశ్వరరావు, కటకం పద్మావతి, కె.రేణుక, ధనమ్మ, పాషా, గిన్నారపు రాజేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: బీఆర్‌ఎస్ ఇల్లెందు అభ్యర్థి బానోతు హరిప్రియకు బీ ఫారం అందించినందుకు ఆదివారం టేకులపల్లి మండలంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు సంబురాలు జరుపుకున్నారు. మండల కమిటీ ఆధ్వర్యంలో టేకులపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. బొమ్మెర్ల వరప్రసాద్ హైదరాబాద్ వెళ్లి ఎమ్మెల్యే హరిప్రియకు బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. టేకులపల్లిలో జరిగిన కార్యక్రమంలో బోడ బాలు, బానోతు రామ, కిషన్, బాలకృష్ణ, అప్పారావు, నరేష్, శివ, చారి, బాలాజీ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఇల్లెందు బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎమ్మెల్యే హరిప్రియకు పార్టీ నాయకత్వం బీఫాం ఇవ్వడాన్ని హర్షిస్తూ ఆ పార్టీ మండల శ్రేణులు ఆదివారం సంబురాలు జరుపుకున్నాయి. చల్లసముద్రం, రేపల్లెవాడ, ఒడ్డుగూడెం గ్రామపంచాయతీల్లో కార్యకర్తలు బాణసంచా కాల్చి హర్షం వెలుబుచ్చారు. సర్పంచ్ అలెం కౌసల్య, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ బండారు శ్రీనివాస్, బండారు వెంకన్న, రమేష్, బింగి వెంకన్న, బండారు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా అటుకుల బతుకమ్మ వేడుకలు



జూలూరుపాడు: వెంగన్నపాలెంలో బతుకమ్మను పూజిస్తున్న మహిళలు



టేకులపల్లి: ఆంజనేయపాలెంలో బతుకమ్మలతో మహిళలు

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని 36 గ్రామ పంచాయతీల్లోని గ్రామాల్లో రెండోరోజు ఆదివారం అటుకుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లో మహిళలు, యువతులు, బాలికలు నూతన వస్త్రాలు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి ఆటపాటలతో సందడి చేశారు.

జూలూరుపాడు: మండలంలో పలు గ్రామాల్లోని మహిళలు, యువతులు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకుంటున్నారు. రెండో రోజు ఆదివారం మహిళలు, యువతులు బతుకమ్మల చుట్టూ తిరుగుతూ అటుకుల బతుకమ్మ పాటలు పాడారు. అనంతరం ఆయా గ్రామాల సమీపంలోని వాగులు, చెరువుల్లో నిమజ్జనం చేశారు.

ఆధార్ నమోదు 'పరేషాన్'

- సుజాతనగర్‌లో ఒకే కేంద్రంతో అవస్థలు
- మరో కేంద్రం ఏర్పాటు చేయాలని స్థానికుల డిమాండ్



ఆధార్ కేంద్రం వద్ద బారులు తీరిన ప్రజలు

సుజాతనగర్: ఆధార్ కార్డుకు మొబైల్ నంబరు లింక్ చేయడం, బయోమెట్రిక్ నమోదు చేయించుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నారులకు కొత్తగా ఆధార్ కార్డు దరఖాస్తు చేయాలన్నా, కొత్తగా పెళ్లి చేసుకొని వచ్చిన వారి చిరునామా మార్పుతో పాటు, ఆధార్ కార్డులో తప్పొప్పుల సవరణకు మండల కేంద్రంలోని ఒకే ఆధార్ కేంద్రం దిక్కుగా మారింది. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా... సుమారు 50 వేల జనాభా వరకు ఉన్నారు. అయితే ఇక్కడ ఏపీజీవీబీ బ్యాంకులో ఓ నిర్వాహకుడు ఆధార్ సెంటర్‌ను నిర్వహిస్తున్నాడు.

అప్పుడప్పుడూ ఇంటర్నెట్ మొరాయిస్తుండటం, ఆధార్ నమోదు సక్రమంగా సాగకపోవడంతో ప్రజలు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. రోజులో 40 మందికి మించి ఆధార్ నమోదు సాగడం లేదు. మండల కేంద్రంలో ఒకే ఆధార్ సెంటర్ ఉండటంతో ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు ఉదయం నుంచే గంటల తరబడి ఆధార్ సెంటర్ వద్ద నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది. గంటల తరబడి నిరీక్షించిన జనం ఆ రోజు పనికాకపోతే మళ్లీ తరువాత రోజు రావాల్సిందే. రోజుల తరబడి ఆధార్ సెంటర్ చుట్టూ తిరుగుతున్నామని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సెంటరు వద్ద కనీస వసతులు కూడా లేవని, సెంటరు బయట.. చెట్ల కింద కూర్చుని గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోందని వాపోతున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని పలువురు మహిళలు, వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుజాతనగర్ మండలంలో మరో ఆధార్ సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మరో కేంద్రం ఏర్పాటు చేయాలి...



ప్రతి ప్రభుత్వ పథకానికి ఆధార్ అవసరం కావడంతో ప్రజలు నమోదుకు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో ఒక ఆధార్ సెంటర్ సరిపోక గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. అధికారులు వెంటనే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. – లోకొట్టి నాగార్జున్, రాఘవాపురం

పరిశీలిస్తాం..



ఆధార్ సేవా కేంద్రాన్ని తనిఖీ చేసి సక్రమంగా పనిచేసే విధంగా చర్యలు తీసుకుంటాను. కొత్త సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు వెళతాం. అధిక చార్జీలు వసూలు చేస్తే నిర్వాహకులపై చర్యలు తీసుకుంటాం. – శిరీష, తహసీల్దార్, సుజాతనగర్